క్లుప్తంగా

అమ్మవారికి విశేష పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలోని గంగమ్మ తల్లి ఆలయంలో భక్తులు అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అభిషేకాలు జరిపి పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. అమ్మ వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.సురేష్‌కుమార్‌రెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు కానుకలను సమర్పించి బంధుమిత్రులతో కలిసి విందు చేశారు. సమీపంలోని సాయిబాబా, ఆంజనేయస్వామి, అక్కదేవతలు, వీరభద్ర స్వామి, వైద్యనాథేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హనుమద్వాహనంపై రంగనాథస్వామి



హనుమద్వాహనంపై దర్శనమిస్తున్న రంగనాథస్వామి

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని రంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ పవిత్రోత్సవాల సందర్భంగా ఆదివారం సతీ సమేత రంగనాథస్వామి హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్ శర్మ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.


మహమ్మద్ ప్రవక్త జ్ఞాపికల ప్రదర్శన



పీఠాధిపతి మహమ్మద్ ప్రవక్త జ్ఞాపికలను ప్రదర్శిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు: మిలాదున్నబీని పురస్కరించుకుని మహమ్మద్ ప్రవక్త యొక్క జ్ఞాపికల ప్రదర్శన ఆదివారం నిర్వహించారు. మసీదులో ప్రార్థనల అనంతరం పీఠాధిపతి కమాలియా పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్ పాషా ఖాద్రీ జ్ఞాపికలకు గంధోత్సవం నిర్వహించారు. అనంతరం పకీర్ల మేళా అలరించింది. పీఠాధిపతి మాట్లాడుతూ ప్రతి ముస్లిం మహమ్మద్ ప్రవక్త మార్గాన్ని అనుసరించాలని సూచించారు. తోటి మనుష్యుల కష్టాలు, బాధలను పంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మత గురువులు సయ్యద్‌షా అసద్ పాషాఖాద్రి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న తాహీర్‌పీరా ఖాద్రి, డాక్టర్ రఫీక్ పాషా

జమ్మలమడుగు రూరల్ : మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఆస్థాన ఎ గౌసియా దర్గా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరా ఖాద్రీ తనయుడు సయ్యద్ షా తాహీర్‌పీరా ఖాద్రి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, జ్యోతి మనో వికాస కేంద్రంలోని మానసిక వికలాంగులకు పండ్లు, బ్రెడ్లు ఆదివారం పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఫీక్ పాషా, కమిటీ సభ్యులు ఎస్.మహమ్మద్ గౌస్, జహంగీర్ బాషా, చాపాడు మహమ్మద్‌గౌస్, ఎంఎం.భాషా, అబ్దుల్, యాసీన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో ర్యాలీ

ప్రవక్త జన్మదినం సందర్భంగా సోమవారం 11 గంటలకు ముస్లింలతో కలిసి శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముస్లిం సోదరులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలి

జమ్మలమడుగు: మండలంలోని గూడెం చెరువులో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు యేసుదాసు, దాసరి విజయ్ డిమాండ్ చేశారు. గూడెం చెరువులో నిర్మించిన ఇళ్లను ఆదివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదల కోసం 2018లో 1404 టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసినా ఇంత వరకూ లబ్ధిదారులకు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలపై మంత్రికి పరిజ్ఞానం లేదు



ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణాలపై ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌కు పరిజ్ఞానం లేదని అర్థమవుతోంది. రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు మంజూరు చేసి.. పూర్తయిన కళాశాలను అప్పటి సీఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. కళాశాల నిర్మాణాలు పూర్తి కాకుండానే ప్రారంభించారనడం మంత్రి అవివేకానికి నిదర్శనం. విద్యార్థులకు వసతులు లేకపోతే జాతీయ మెడికల్ కౌన్సిల్ మెడికల్ సీట్లు ఎలా మంజూరు చేసిందో మంత్రి సత్య కుమార్ సమాధానం చెప్పాలి.

– కె.వెంకట బయపురెడ్డి, జెడ్పీటీసీ, వేముల



విద్యార్థులకు అన్యాయం



రాష్ట్రంలోని విద్యార్థులకు వైద్య విద్యతో బాటుగా ప్రతి జిల్లా పరిధిలోని ప్రజలకు మంచి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ధ్యేయంతో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటుచేసిన పులివెందుల మెడికల్ కళాశాలకు మంజూరైన 50 సీట్లను రద్దు చేయాలని ప్రభుత్వం లేఖ రాయడం అన్యాయం. వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వం వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వాటిని సమకూర్చాల్సి ఉంటుంది. ఎలాంటి అవగాహన లేని మంత్రి సత్యకుమార్ అర్థరహితంగా మాట్లాడడం విడ్డూరంగా వుంది.

– పి.నరేన్‌రామాంజులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కమలాపురం

బొజ్జగణపయ్యా.. వెళ్లి రావయ్యా

ఆకట్టుకున్న చెక్క భజన నృత్యాలు

పులివెందుల రూరల్ : ఉండ్రాళ్లయ్యా.. వెళ్లిరావయ్యా అంటూ తొమ్మిదో రోజున భక్తులు వైభవంగా నిమజ్జనం జరిపారు. పట్టణంలోని మైత్రీ లే అవుట్‌లో కొలువుదీరిన గణనాథుడికి ముందుగా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం నృత్యాలు, చెక్క భజనల మధ్య గణనాథుడిని వేదికపై కొలువుంచి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. దారి పొడవునా మహిళలు, పిల్లలు, పెద్దలు రంగులు చల్లుకుంటూ జైగణేష్.. మహరాజ్‌కి జైగణపతి పప్పా మోరియా.. అంటూ ఊరేగింపుగా తీసుకువచ్చారు. నారాయణ పాఠశాల నుంచి పాత బస్టాండ్, పూల అంగళ్ల మీదుగా తొండూరు మండలం ఇనగనూర్ వంక వరకు ఊరేగించి నిమజ్జనం చేశారు.మీ కార్యక్రమంలో వైఎస్సాఆర్‌సీపీ నాయకులు, టీడీపీ నాయకులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఆదివారం వినాయక నిమజ్జనం వేడుక ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాల మధ్య యువతీ, యువకులు, మహిళలు రంగులు చల్లుకుంటూ, చిందులేస్తూ వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు. పలు ప్రాంతాలలో కొలువుదీరిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.



వేంపల్లెలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

వేంపల్లెలో..

వేంపల్లె : వినాయక చవితి పండగ సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక ప్రతిమలను తొమ్మిదో రోజున విఘ్నేశ్వరుడి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. వేంపల్లె శ్రీచైతన్య పాఠశాల, కాపు వీధిలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను వేంపల్లె వీధుల్లో ఊరేగించారు. డప్పులు, మేళతాళాలు, డిజే పాటలు, కోలాటం, విచిత్ర వేషధారణ, టపాసుల మధ్య జై బోలో గణేష్ మహారాజ్‌కి జై అంటూ రంగులు చల్లుకుటూ యువత కేరింతలు కొట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు నిర్వహించారు. శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఊరేగింపులో ప్రజలకు ప్రసాదం పంపిణీ చేశారు.

బొజ్జగణపయ్యా వెళ్లిరావయ్యా



జమ్మలమడుగు రామదేవాలయం వద్ద నిమజ్జనానికి సిద్ధం చేసిన వినాయకుడు



మైత్రీ లే అవుట్‌లోని గణనాథుడు

జమ్మలమడుగు : బొజ్జగణపయ్య నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని బ్యాంకు కాలనీ, కన్నెలూరులోని నేతాజీ నగర్, రామదేవాలయం ప్రాంతంలో తొమ్మిది రోజులుగా వేదికలపై కొలువుదీరిన గణేశుడికి ముందుగా ప్రత్యేక పూజలు చేసి అనంతరం అల్పాహార విందు ఇచ్చారు. సాయంత్రం యువత కోలాహలం మధ్య పెన్నా, కుందూ నదుల్లో నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



పులివెందులలో చెక్కభజన చేస్తున్న యువతీ, యువకులు



పులివెందులలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని కీర్తనతో ఉపాధ్యాయురాలు

వల్లూరు : వల్లూరు మండలం గంగాయపల్లెలో వున్న ఏపీ మోడల్ స్కూల్ కమ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ సీఈసీ చదువుతున్న కె.కీర్తన క్యారం బోర్డు ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయురాలు సుశీలమ్మ ఆమెను అభినందించారు.

కొండాపురంలో..



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

కొండాపురం: చక్రాయపేట మండలంలోని గండిలోని డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ క్రిష్ణవేణి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న నాగవల్లి(ఎంపీసీ) ఖోఖోకు, జి.కీర్తన(ఎంపిసి) హ్యాండ్‌బాల్‌కు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని టి.తులసి హ్యాండ్‌బాల్‌కు ఎంపికై నట్లు తెలిపారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి

వేంపల్లె : ఇంజినీరింగ్ ప్రతిభతో అసాధారణ విజయం సాధించిన మోక్ష గుండం విశ్వేశ్వరయ్యను విద్యార్థులంతా స్ఫూర్తిగా తీసుకోవాలని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా అన్నారు. ఇంజినీరింగ్ డే సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి మేథస్సుకు శాస్త్రీయత తోడైతే మహాద్భుతాలు సృష్టించవచ్చునని.. అందుకు నిదర్శనం మోక్ష గుండం విశ్వేశ్వరయ్య అన్నారు. కృష్ణరాజసాగర్ ఆనకట్ట, బృందావన్ గార్డెన్, భద్రావతి ఉక్కు కర్మాగారం, మైసూర్ బ్యాంకు, దక్కన్ ప్రాంతంలో నీటి పారుదల వ్యవస్థ, తదితర అంశాలపై వివరించారు. సమాజానికి అవసరమయ్యే ఇంజినీర్లుగా ఎదిగే తీరుపై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. సమయం వృథా చేయకుండా అవకాశాలు వినియోగించుకుని చదివిన కళాశాల, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి రవికుమార్, సివిల్ ఇంజినీరింగ్ ఉపాధ్యాయలు బొజ్జ అనిల్ కుమార్ రెడ్డి, డా.సత్యనారాయణ, దినేష్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్

విజేతలకు బహుమతుల ప్రదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 21వ అష్రఫ్, ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చెస్ టోర్నమెంటులో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. క్రీడాకారులకు విస్‌డమ్ స్కూలు వైస్ ప్రిన్సిపాల్ షంటూ, వైఎస్సార్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారిలు వీటిని అందజేశారు. ఈ టోర్నమెంటులో వినూత్ మొదటి, రెండవ స్థానంలో రెడ్డి వవన్, మూడవ స్థానంలో అనురాగ్, తర్వాతి స్థానాలలో ప్రభుదేవా, కరీముల్లా, ప్రణవ్, నవీన్, ఫరూఖ్, రేహాన్, ఉమాదేవి నిలిచారు. ఈ పోటీలలో జిల్లా నలుమూలల నుంచి దాదాపు 100 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కోచ్ తబస్సుమ్, చీఫ్ ఆర్బిటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో అతిథులు, నిర్వాహకులు

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున సోమవారం ఉదయం 9 గంటల నుండి 11గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈఈ జగదీశ్వర రెడ్డి తెలిపారు. పులివెందుల మెయిన్ రోడ్, అంబకపల్లి రోడ్డు, బైపాస్ రోడ్డు, లే అవుట్, ఎస్బీఐ కాలనీ మరియు కడప రోడ్లలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

పీఎఫ్, ఏపీజీఎల్ఐ చెల్లింపులు ఎప్పుడో?

ఎర్రగుంట్ల : ఉపాధ్యాయులంతా వేతనాల నుంచి దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ వెంటనే మంజూరు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక జడ్పీ బాలురోన్నత పాఠశాలలో ఆదివారం ఎస్టీయూ ప్రాంతీయ కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు రూ.21 వేల కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం ఇంత వరకూ స్పష్టత ఇవ్వలేదన్నారు. కొత్త ప్రభుత్వంలో యాప్‌ల భారం తగ్గుతుందని ఉపాధ్యాయులు ఆశించినప్పటికీ, గతానికి ఇప్పటికీ తేడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ అన్వర్ బాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రమణా రెడ్డి, బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వ రెడ్డి పాల్గొన్నారు.

ఆదమరిస్తే... అంతే..

పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డుపై శ్రీకర్ ఫంక్షన్ హాల్ సమీపంలో మ్యాన్ హోల్ దెబ్బతిని వారం రోజులు గడచినా పట్టించుకునే వారే లేరు. రాత్రి సమయాల్లో వేగంగా వస్తున్న వాహనదారులు మ్యాన్‌హోల్ గమనించకుండా ఆదమరచి నడిపితే ప్రమాదాల బారిన పడాల్సిందే. కొందరు మ్యాన్ హోల్స్‌పై టెంకాయ పట్టను ఇలా అడ్డంగా పెట్టి ప్రమాదాన్ని గుర్తు చేస్తున్నారు.

– పులివెందుల రూరల్



మ్యాన్‌హోల్‌పై టెంకాయపట్టను ఏర్పాటు చేసిన స్థానికులు

దారి ఇలా.. రాళ్లపై వెళ్లేదెలా

పులివెందుల–కడప రోడ్డులోని బాలయోగి గురకుల పాఠశాల వద్ద రోడ్డుపై కంకర తేలింది. రోడ్డుపై గుళక రాళ్లు ఉండడంతో బస్సులు, లారీలు వెళ్లేటప్పుడు రాళ్లు ఎగిరి వాహనదారులకు తగులుతున్నాయి. భారీ వాహనాలు వెళ్లేటప్పుడు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని వాహనాలు నడపాల్సి వస్తోందని ద్విచక్ర వాహనదారులు చెబుతున్నారు. గుళక రాళ్లు తేలిన చోట తారు వేసి బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– పులివెందుల రూరల్



గులకరాళ్లతో నిండి ఉన్న గురుకులపాఠశాల రహదారి

లావనూరులో కొండచిలువ

కొండాపురం : మండలంలోని లావనూరు గ్రామంలోని ఓ రైతుకు చెందిన గడ్డివామి సమీపంలో ఆదివారం కొండ చిలువ కనిపించింది. రైతుతో పాటు, గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. ముళ్ల పొదలు, రైతుల తోటల్లో తరచూ కొండ చిలువలు కనిపిస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.



లావనూరులో కనిపించిన కొండ చిలువ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వేంపల్లె : ఆ నాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధుర స్మృతులే అని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. వేంపల్లె పట్టణంలోని తలిశెట్టి శేషమ్మ జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 1985–86లో పదోతరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా కలిసి పాత జ్ఞాపకాలను నేమరు వేసుకున్నారు. నాడు బోధించిన ఉపాధ్యాయులను గౌరవిస్తూ నమస్కార వందనం చేశారు. తమ గురువులు మంగమ్మ, సరస్వతమ్మ, శకుంతలమ్మ, సరోజమ్మలకు దుస్తులు సమర్పించి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పూర్వ విద్యార్థులు షకీల, రాజేశ్వరి, నాగవల్లి మాట్లాడుతూ స్నేహితులతో పంచుకున్న నాటి జ్ఞాపకాలు, గడిపిన మధురమైన క్షణాలను 38 ఏళ్ల తర్వాత తలచుకుని ఆనందంగా గడిపామన్నారు. అందరినీ కలుపుతూ సమ్మేళనం నిర్వహించడం సంతోషకరమన్నారు. స్నేహితులు మంచి హోదాలో ఉండడం ఆనందాన్నిచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సరళ, సరస్వతి, పద్మ, షకీలాభాను, సుశీల, షాకీరా, శ్రీదేవి, రెడ్డెమ్మ, సుజాత, యల్లమ్మ, పద్మజ, గురుదేవి, వాసవి, రమాదేవి, సిద్దేశ్వరి, జయలక్ష్మి, సరళ, సాయిలక్ష్మి రమ, నిరంజనమ్మ, ధనలక్ష్మి, అన్నపూర్ణ, గీతావాణి, ఆశ్రిఫున్ పాల్గొన్నారు.



గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

కొండాపురంలో..

కొండాపురం : 2006–07లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అంతా ఒక్క చోట చేరారు. 17 సంవత్సరాల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో వారంతా కలుసుకుని ఒకరినొకరు నాటి విశేషాలు ముచ్చటించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రామచంద్రుడు మాట్లాడుతూ సమాజంలో నీతి, నిజాయితీతో ప్రజలకు తమ వంతు సేవ చేసుకోవాలని పిలుపునిచ్చారు. తబ బాల్యంలో తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకొని ఒకరి నొకరు ముచ్చటించుకున్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు హనుమంతరెడ్డి, శంకర్‌రెడ్డి జయమ్మ, తదితరులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తమకు పాఠాలు బోధించిన నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కుమారుల మానవత్వం

తల్లిమరణం తర్వాత నేత్రదానం

పులివెందుల రూరల్ : కుమారులు మానవత్వం చూపారు.. తమ తల్లి మరణించడంతో ఆమె నేత్రాలు దానం చేశారు. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన చింతాకు పెద్దక్క(52) ఆదివారం మరణించారు. ఆమె కుమారులు రామాంజనేయులు, ప్రభాకర్, కుమార్తె మరియమ్మ పెద్దక్క నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇవ్వడంతో టెక్నీషియన్ హరీష్‌తో వచ్చి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నేత్రదానం చేయదలచుకున్న వారు 9966509364, 7093204537 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. నేత్ర దాత కుటుంబీకులను వైకాపా మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, గ్రామ పెద్దలు, అభినందించారు.



కార్నియాలను సేకరిస్తున్న నేత్ర సేకరణ సంస్థ అధ్యక్షుడు రాజు, తదితరులు

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

వేంపల్లె : మండలంలోని నందిపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు శ్రీనువాసులురెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. నందిపల్లె నుంచి మోటారు బైక్‌లో ఉపాధ్యాయుడు శ్రీనువాసులురెడ్డి వస్తుండగా గుర్రమ్మ లిఫ్ట్ అడగడంతో వాహనం నిలిపారు. వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. దీంతో శ్రీనివాసులురెడ్డి, గుర్రమ్మలకు గాయాలయ్యాయి. 108 వాహనంలోఆసుపత్రికి తరలించారు.



గాయపడిన ఉపాధ్యాయుడు